ఉత్తరం
TG TEL/25/A1234
www.kakatiyanews.com
# కాకతీయ
ఆదివారం, 18 అక్టోబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 58 | పేజీలు: 4 వెల: 5

రెండేళ్ల క్రితం ఆదేశించినా అమలులో నిర్లక్ష్యంపై అసంతృప్తి

ఉల్లంఘనలకు భారీ జరిమానాలు.. అక్రమ ఆదాయం స్వాధీనం

హానికర కంటెంట్ గుర్తింపు, తొలగింపునకు ప్రత్యేక సాంకేతిక వ్యవస్థ

జాతీయ స్థాయిలో హాష్, యూఆర్ఎల్ జాబితా ఏర్పాటు చేయాలి

పిల్లల ఇంటర్నెట్ హక్కులనూ పరిరక్షించాలి

సోషల్ మీడియా సంస్థలపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి

పిల్లల లైంగిక దోపిడీకి సంబంధించిన కంటెంట్‌ను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచే సోషల్ మీడియా సంస్థలపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. నిషేధిత కంటెంట్‌ను పేవాల్, సబ్‌స్క్రిప్షన్ వంటి విధానాల ద్వారా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అందించడం, అప్‌లోడ్ చేయడం, ప్రచారం చేయడం, ప్రసారం చేయడం జరగకుండా అన్ని మధ్యవర్తిత్వ సంస్థలు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. రెండేళ్ల క్రితమే ఈ అంశంపై ఆదేశాలు ఇచ్చినా, వాటి అమలులో చెప్పుకోదగ్గ పురోగతి కనిపించడం లేదని వ్యాఖ్యానించింది.

# పిల్లల లైంగిక దోపిడీ కంటెంట్‌పై సుప్రీం కొరడా!



## పేవాల్, సబ్‌స్క్రిప్షన్ల ముసుగులోనూ అనుమతించొద్దు

**కాకతీయ, నేషనల్ డెస్క్:** పిల్లల భద్రతకు ముప్పు కలిగించే కంటెంట్ వ్యాప్తిని అడ్డుకోవడంలో సోషల్ మీడియా సంస్థలు, సంబంధిత నియంత్రణ వ్యవస్థలు మరింత బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం అక్టోబర్ 15న ఈ ఆదేశాలు జారీ చేసింది. పిల్లల లైంగిక దోపిడీ, వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేషన్ అండ్ అబ్యూస్ మెటీరియల్ (సీఎస్ఈఏఎం)గా పేర్కొంది. ఈ తరహా కంటెంట్‌ను నేరుగా లింకుల రూపంలో అందించడమే కాకుండా, సబ్‌స్క్రిప్షన్ లేదా పేవాల్ వెనుక ఉంచి అందుబాటులోకి తీసుకురావడం కూడా అరికట్టాలని సూచించింది. కంటెంట్‌ను అప్‌లోడ్ చేయడం, హోస్ట్ చేయడం, ప్రచారం చేయడం, ప్రసారం చేయడం వంటి చర్యలు

........(తరువాయి 2లో)




# రాజ్యాంగ హక్కులకు ముప్పు!

## మోదీ పాలనలో వ్యవస్థలు సర్వ నాశనం

**కాకతీయ,తెలంగాణ బ్యూరో:** మోదీ పాలనలో రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులు, పౌర స్వేచ్ఛ ప్రమాదంలో పడ్డాయని, రాజ్యాంగ ప్రజాస్వామ్య పరిరక్షణకు అన్ని రంగాల వృత్తి నిపుణులు ఏకతాటిపైకి రావాలని ఏఐసీసీ ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ పిలుపునిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ సభ్యత్వంతో సంబంధం లేకుండా నిపుణులంతా తమతో కలిసి పనిచేయాలని కోరారు. ఏఐపీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా గాంధీభవన్‌కు వచ్చిన ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ భగవద్గీత, బైబిల్, ఖురాన్ వంటి పవిత్ర గ్రంథాలతో సమానమని మధుయాష్కీ పేర్కొన్నారు. 2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత రాజ్యాంగం, పౌరుల స్వేచ్ఛకు ముప్పు ఏర్పడిందని విమర్శించారు. వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగినవారిని ఒకే వేదికపైకి తీసుకొచ్చి రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలనే ఉద్దేశంతో 2017లో రాహుల్‌గాంధీ ప్రొఫెషనల్స్ కాంగ్రెస్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. స్వాతంత్ర్యానికి ముందు దాదాభాయ్ నౌరోజీ, మోతీలాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, మహాత్మాగాంధీ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వంటి నాయకులు ప్రజల్లో స్వాతంత్ర్య

........(తరువాయి 2లో)

సమానత్వం, స్వేచ్ఛ, ప్రజాస్వామ్య పరిరక్షణకు సమష్టి పోరాటం

వృత్తి నిపుణులతో ఏఐపీసీని దేశవ్యాప్తంగా బలోపేతం చేస్తాం

100 పట్టణ జిల్లాల్లో ప్రొఫెషనల్స్ కమిటీల ఏర్పాటు

న్యాయ, వైద్య రంగాల్లో 100 సహాయ కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక

పరిపాలనలో పారదర్శకతకు 'షాడో మినిస్ట్రీ' అవసరం

ఏఐసీసీ ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ మధుయాష్కీ గౌడ్



# గోదావరి జలాలపై కుట్ర

## తెలంగాణ హక్కులకు మరణశాసనం!

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** గోదావరి-కావేరీ నదుల అనుసంధానం పేరుతో తెలంగాణ నీటి హక్కులను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. పోలవరం నుంచి బొల్లపల్లి మీదుగా నీటిని తరలించే ప్రతిపాదనతో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను

........(తరువాయి 2లో)

- గోదావరి–కావేరీ లింకు పేరుతో రాష్ట్రానికి తీరని నష్టం
- పోలవరం నుంచి బొల్లపల్లి మీదుగా నీళ్ల తరలింపునకు చంద్రబాబు యత్నం
- తెలంగాణ వాటా తేల్చకుండా అనుసంధానం ఎలా చేస్తారు?
- పంపులు నడపకుండా కరువు తెచ్చారు.. రైతులను ఆదుకోవడంలో విఫలం
- ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలి.. తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

# పండుగకు పల్లెబాట..

## హైవేలపై ట్రాఫిక్ పాట్లు!

- చౌటుప్పల్, చిట్యాల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు నిలిపివేత
- విజయవాడ హైవేపై 45 నిమిషాల నుంచి గంటకుపైగా నిరీక్షణ
- బస్టాండ్లు కిటకిట.. ప్రత్యేక బస్సుల ఛార్జీలపై ప్రయాణికుల ఆగ్రహం



**కాకతీయ, హైదరాబాద్ :** దసరా పండుగను సొంతూళ్లలో జరుపుకునేందుకు నగరవాసులు పల్లెబాట పట్టడంతో జాతీయ రహదారులపై వాహనాల రద్దీ భారీగా పెరిగింది. హైదరాబాద్-విజయవాడ హైవేతో పాటు హైదరాబాద్-ముంబై, చెన్నై మార్గాల్లోనూ వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ఆదివారం సద్దుల బతుకమ్మ, సోమవారం మహర్నవమి, మంగళవారం విజయదశమి సెలవులు రావడంతో కుటుంబాలతో కలిసి సొంత వాహనాల్లో బయలుదేరిన వారి సంఖ్య పెరిగింది.

........(తరువాయి 2లో)



## సారే కావాలంటున్నారు..

# కేసీఆరే మళ్లీ రావాలంటున్నారు..

## బీఆర్ఎస్ నాయకత్వాన్నే తెలంగాణ కోరుకుంటోంది

- మూడేళ్లలో తెలంగాణకు కాంగ్రెస్ చేసిందేమీ లేదు
- వరంగల్ జిల్లాపై మంత్రి పొంగులేటి పెత్తనం
- ప్రజా సమస్యలపై కాకుండా కాంట్రాక్టులపైనే ఆయన సమీక్షలు
- ఓరుగల్లులో మంత్రులున్నా ఇన్‌చార్జి మంత్రి మాటే చెల్లుబాటు
- పట్టభద్రుల ఓటరు నమోదును ఉద్యమంలా చేపట్టాలి
- బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

**కాకతీయ, హన్మకొండ:** తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో రాష్ట్రానికి చేసిందేమీ లేదని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి కాంట్రాక్టులు, పనుల కేటాయింపులపైనే సమీక్షలు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో తెలంగాణకు చేసిందేమీ లేదని విమర్శించారు. కాంట్రాక్టులు, పనుల కేటాయింపులపై సమీక్షలు నిర్వహిస్తున్న ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని ప్రశ్నించారు. ఓరుగల్లుకు చెందిన మంత్రులు ఉన్నప్పటికీ ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పెత్తనం కొనసాగుతోందని ఆరోపించారు. ఎంపీ ఎన్నికల సమయంలో హనుమకొండ చౌరస్తాకు వచ్చి ఇచ్చిన రెండు హామీలపై శాసనమండలిలో ప్రశ్నిస్తే, మంత్రులే తమకు తెలియదని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కేసీఆర్ పాలనలో నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే బాధ్యత వహించే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం నిధుల విడుదల కోసం కూడా ఇతరులపై ఆధారపడాల్సి వస్తోందని విమర్శించారు.

**పట్టభద్రుల ఓటరు నమోదును ఉద్యమంలా చేపట్టాలి**

రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఓటరు నమోదు

........(తరువాయి 2లో)

# మూడు దశల్లో సమగ్ర భూసర్వే

- 285 గ్రామాల్లో సర్వే పూర్తి..
- అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు
- వచ్చే నెలాఖరుకు తొలి దశ పూర్తి చేయాలని లక్ష్యం
- 9,767 ఎకరాల భూమి ఆదా.. రూ.2,148.74 కోట్ల వ్యయం తగ్గింపు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



**కాకతీయ, హైదరాబాద్:** రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపట్టిన సమగ్ర భూసర్వేను మూడు దశల్లో పూర్తి చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ప్రతి భూకమతానికి కచ్చితమైన హద్దులు నిర్ణయించి, యాజమాన్య హక్కులపై స్పష్టత కల్పిస్తామని తెలిపారు. ఇప్పటికే 285 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తిచేసి, భూ యజమానుల అభ్యంతరాల

........(తరువాయి 2లో)

## ములుగు మత్తులో.. సిండికేట్ సత్తా!

- జిల్లాలో 2,700లకు పైగా బెల్ట్ షాపులు
- ప్రతీ గ్రామంలో అనధికారికంగా వైన్‌షాపులు
- 29 వైన్ షాపుల నుంచి బెల్ట్ షాపులకు సరఫరా
- సిండికేట్ గుప్పిట్లో మద్యం వ్యాపారం
- బెల్ట్ షాపుల్లో రూ.20 నుంచి రూ.30ల అదనం
- ఫుట్ బాటిళ్లంపై రూ.50 నుంచి రూ.100 వరకు పెట్టాల్సిందే
- కొరవడిన ఎక్సైజ్ శాఖ అధికారుల నిఘా
- మామూళ్ల మత్తే కారణమంటున్న జిల్లా వాసులు



4

## నంబర్ ప్లేట్ లేదు.. దర్పం మాత్రం ఫుల్!

- జిల్లా యూత్ ప్రెసిడెంట్ బోర్డుతో ఇన్నోవా క్రిస్టా హల్‌చల్
- నేతల వాహనాలకు నిబంధనలు వర్తించవా?
- ట్రాఫిక్ పోలీసుల తీరుపై ప్రజల ప్రశ్నలు




4

# గోదావరి జలాలపై కుట్ర..




(మొదటిపేజీ తరువాయి)

కాపాడాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ అంశంపై మౌనంగా ఉండటం సరికాదన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ నవంబర్ 3న ఢిల్లీలో జరగనున్న జాతీయ జల అభివృద్ధి సంస్థ సమావేశం ఎజెండాలో గోదావరి-కావేరీ అనుసంధానాన్ని చేర్చడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ నీటి వాటా, పెండింగ్ ప్రాజెక్టుల ప్రయోజనాలు తేల్చకుండా ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లకూడదని డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్టోబర్ 7న గోదావరి-కావేరీ అనుసంధానంపై లేఖ రాశారని హరీశ్‌రావు తెలిపారు. ఆ లేఖలోని ప్రతిపాదనల మేరకు అంశాన్ని సమావేశం ఎజెండాలో చేర్చారని విమర్శించారు. తొలుత పోలవరం-బనకచర్ల లింకు ప్రాజెక్టు పేరుతో గోదావరి జలాలను తరలించే ప్రయత్నం జరిగిందని, ఆ తర్వాత నల్లమలసాగర్ ప్రతిపాదన తెరపైకి వచ్చిందని చెప్పారు. ఇప్పుడు గోదావరి-కావేరీ నదుల అనుసంధానం పేరుతో పోలవరం నుంచి బొల్లపల్లి, నాగార్జునసాగర్, సోమశిల మీదుగా నీటిని తరలించే ప్రతిపాదన ముందుకు తెచ్చారని ఆరోపించారు. గోదావరి జలాల తరలింపునకు సంబంధించి ప్రతిపాదనల పేర్లు మారుతున్నా, తెలంగాణ ప్రయోజనాలపై స్పష్టత ఇవ్వడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. గతంలో ఇచ్చంపల్లి లేదా సమ్మక్కసాగర్ నుంచి నీటిని తరలించే ప్రతిపాదన ఉందని, ఇప్పుడు ఆ మార్గాన్ని పక్కనపెట్టి పోలవరం నుంచి బొల్లపల్లి మీదుగా తీసుకెళ్లాలని చూస్తున్నారని పేర్కొన్నారు. బొల్లపల్లి రిజర్వాయర్‌లో 150 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే ప్రతిపాదన ఉందని, దీనివల్ల తెలంగాణకు కలిగే ప్రయోజనాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**తెలంగాణ వాటా తేల్చాకే అనుసంధానం**

గోదావరి-కావేరీ లింకులో తెలంగాణకు న్యాయమైన వాటా కల్పించాలని హరీశ్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్రానికి 968 టీఎంసీల నీటి వినియోగానికి అనుమతి ఇవ్వాలని, అనుసంధానం ద్వారా తరలించే నీటిలో 50 శాతం తెలంగాణకు కేటాయించాలని గతంలోనే కోరినట్లు తెలిపారు. తెలంగాణ నీటి అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా ఇతర ప్రాంతాలకు నీటిని తరలించడం సమంజసం కాదన్నారు. జాతీయ జల అభివృద్ధి సంస్థ ప్రతిపాదన ప్రకారం ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని 148 టీఎంసీల నీటిని గోదావరి-కావేరీ అనుసంధానానికి వినియోగించాలనే ఆలోచన ఉందని వివరించారు. ఈ నీటిలో తెలంగాణకు 43 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 44 టీఎంసీలు, తమిళనాడుకు 42.5 టీఎంసీలు, పుదుచ్చేరికి 2.5 టీఎంసీలు, కర్ణాటకకు 16 టీఎంసీలు కేటాయించే ప్రతిపాదన ఉందని పేర్కొన్నారు. ఈ కేటాయింపులు, తెలంగాణ అవసరాలపై స్పష్టత ఇవ్వకుండా ప్రాజెక్టు మార్గాన్ని మార్చడం రాష్ట్రానికి నష్టం కలిగిస్తుందని విమర్శించారు. ఇచ్చంపల్లి నుంచి నాగార్జునసాగర్ మీదుగా అనుసంధానం జరిగితే తెలంగాణకు నీటి ప్రయోజనాలు ఉంటాయని హరీశ్‌రావు అన్నారు. కరువు పరిస్థితుల్లో ఆ నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుందని, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో 2,38,236 ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని తెలిపారు. ఈ అంశం గతంలో కేంద్రం కుదుర్చుకున్న అవగాహనలోనూ ఉందని పేర్కొన్నారు. ప్రతిపాదిత మార్గాన్ని మార్చితే తెలంగాణ పరిశ్రమలకు, తాగునీటికి, సాగునీటికి ఎలాంటి భరోసా ఉంటుందని ప్రశ్నించారు. తెలంగాణకు ప్రయోజనం కలిగించే ఇచ్చంపల్లి, సమ్మక్కసాగర్ మార్గాలను పక్కనపెట్టడం వెనుక కారణమేమిటని నిలదీశారు. రాష్ట్రానికి ప్రయోజనం కలిగే ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ గతంలో లేఖ రాసిందని, సమ్మక్కసాగర్‌కు 45 టీఎంసీల అనుమతిపై అభ్యంతరాలు వ్యక్తం చేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు తెలంగాణకు నష్టం కలిగించేలా మార్గాన్ని మార్చడంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు.

**పెండింగ్ ప్రాజెక్టులతో తెలంగాణకు నష్టం**

తెలంగాణలో ఇంకా 139 టీఎంసీల నీటి వినియోగానికి సంబంధించిన ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. వార్ధా, సమ్మక్కసాగర్ తదితర ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా వ్యవహరించడం లేదని విమర్శించారు. తెలంగాణకు అవసరమైన ప్రాజెక్టులకు అనుమతులు, నిధులు సాధించడంలో విఫలమవుతున్న ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలకు నీటిని తరలించే ప్రతిపాదనలపై ఎందుకు మౌనంగా ఉంటోందని ప్రశ్నించారు. గోదావరి-కావేరీ అనుసంధానం జాతీయ ప్రయోజనాల కోసం చేపడుతున్న ప్రాజెక్టు అని చెబుతున్నారని, అయితే ఒక రాష్ట్రానికి నష్టం కలిగించే ప్రతిపాదనను జాతీయ ప్రయోజనంగా ఎలా పరిగణిస్తారని నిలదీశారు. తెలంగాణకు కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి వంటి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వాలని కోరినా స్పందన లేదని విమర్శించారు. తెలంగాణకు కూడా జాతీయ ప్రాజెక్టుల విషయంలో సమాన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**పంపులు నడపకుండా కరువు తెచ్చారు**

రాష్ట్రంలో సాగునీటి సమస్యలపై కూడా హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. దేవాదుల ప్రాజెక్టులో పది మోటార్లు నడపాల్సిన చోట మూడే ఎందుకు నడుపుతున్నారని ప్రశ్నించారు. కన్నెపల్లి, కల్వకుర్తి పంపుల విషయంలోనూ పూర్తిస్థాయిలో నీటిని ఎత్తిపోసేందుకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. శ్రీశైలంలో నీటి నిల్వలు ఉన్నప్పటికీ వాటిని వినియోగించుకోలేదని విమర్శించారు. దేవాదులలో పది మోటార్లను నడిపి ఉంటే చెరువులు, చెక్‌డ్యామ్‌లు, రిజర్వాయర్లు నిండేవని, వరంగల్ ప్రాంతంలో సాగునీటి ఇబ్బందులు తగ్గేవని పేర్కొన్నారు. కల్వకుర్తి ప్రాజెక్టు ద్వారా 35 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ 13 టీఎంసీలకే పరిమితమయ్యారని ఆరోపించారు. కన్నెపల్లిలో పంపులు నడిపితే తెలంగాణకు, హైదరాబాద్‌కు నీటిని అందించే అవకాశం ఉన్నప్పటికీ రాజకీయ కారణాలతో నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంపుల విషయంలో జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థను సాకుగా చూపి కాలయాపన చేశారని హరీశ్‌రావు అన్నారు. అయితే నీటిని ఎత్తిపోవాలా వద్దా అనేది రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమని జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ హైకోర్టులో అఫిడవిట్ వేసినట్లు పేర్కొన్నారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ నివేదికలో సానుకూల అంశాలు ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ కంటే తక్కువ వర్షపాతం నమోదైనా అక్కడ పంటల సాగుకు ఆంక్షలు విధించలేదని, తెలంగాణలో మాత్రం పంటలు వేయొద్దని చెబుతున్నారని విమర్శించారు. అక్కడ జలహారతి ఉంటే తెలంగాణలో కన్నీళ్ల హారతి పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఏర్పడిన పరిస్థితి అని ఆరోపించారు.

**కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి**

గోదావరి జలాల తరలింపుపై చంద్రబాబు వరుసగా లేఖలు రాస్తూ, ఢిల్లీలో సమావేశాల్లో పాల్గొంటున్నారని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం స్పందించడం లేదని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలకే ప్రాధాన్యం ఇవ్వకుండా తెలంగాణ నీటి హక్కులను పరిరక్షించాలని కోరారు. రాష్ట్రానికి చెందిన ఎంపీలు ఈ అంశంపై కేంద్రాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు. కర్ణాటకను ఒప్పించేందుకు గోదావరి జలాల వినియోగంతోపాటు ఆల్మట్టి వద్ద 16 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే ప్రతిపాదనను చంద్రబాబు ముందుకు తెచ్చారని హరీశ్‌రావు ఆరోపించారు. పోలవరం ద్వారా 21 టీఎంసీల నీటి మళ్లింపు ప్రతిపాదనతోపాటు మరో 16 టీఎంసీలను నిల్వ చేసుకునే అంశం అమలైతే పాలమూరు ప్రాంతానికి నష్టం కలిగే ప్రమాదం ఉందన్నారు. నీటి సమస్యలు భవిష్యత్తులో మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్నందున ఇప్పుడే తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తం కావాలని సూచించారు. తెలంగాణకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలపై ఎలాంటి ద్వేషం లేదని, అయితే రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగితే చూస్తూ ఊరుకోబోమని హరీశ్‌రావు స్పష్టం చేశారు. గోదావరి-కావేరీ అనుసంధాన ప్రతిపాదనలను పునఃపరిశీలించి, తెలంగాణ వాటా, పెండింగ్ ప్రాజెక్టుల ప్రయోజనాలకు హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైతే ప్రజల తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# రాజ్యాంగ హక్కులకు ముప్పు!




(మొదటిపేజీ తరువాయి)

కాంక్షను పెంచడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు.

**వృత్తి నిపుణులతో దేశవ్యాప్త విస్తరణ**

న్యాయవాదులు, వైద్యులు, ఉపాధ్యాయులు, ఆచార్యులు, ఇంజినీర్లు, జర్నలిస్టులు సహా వివిధ రంగాల నిపుణులు ఏఐపీసీలో భాగస్వాములు కావాలని మధుయాష్కీ కోరారు. దేశవ్యాప్తంగా తొలి దశలో 100 పట్టణ జిల్లాల్లో వృత్తి నిపుణులతో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణను ఏఐపీసీకి నమూనాగా తీర్చిదిద్ది, ఆ తర్వాత దేశవ్యాప్తంగా సంస్థను విస్తరిస్తామని వెల్లడించారు. ప్రజలకు గౌరవప్రదమైన జీవితం అందించడంతోపాటు చట్టాల రూపకల్పన, అమలులో పౌరుల భాగస్వామ్యాన్ని పెంచడం తమ లక్ష్యమన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కలిగిన నిపుణులను తీర్చిదిద్దేందుకు మన్మోహన్‌సింగ్ ఫెలోషిప్ ద్వారా శిక్షణ అందిస్తున్నట్లు మధుయాష్కీ తెలిపారు. తొలి విడతలో ఏడాదిపాటు 50 మందికి శిక్షణ ఇచ్చామని, రెండో విడతకు 800 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ విడతలో 100 మందికి శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు https://manmohansinghfellows.com ద్వారా వివరాలు తెలుసుకొని పేర్లు నమోదు చేసుకోవచ్చని సూచించారు.

**100 సహాయ కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక**

ప్రజలకు న్యాయ, ఆరోగ్య తదితర రంగాల్లో సహాయం అందించేందుకు ఏఐపీసీ ద్వారా 100 సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు మధుయాష్కీ వెల్లడించారు. గత యూపీఏ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్‌తో ప్రత్యక్ష సంబంధం లేని మేధావులు, నిపుణుల సూచనలతో సంక్షేమ పథకాలు, విధానాలను రూపొందించామని గుర్తుచేశారు. ప్రస్తుతం మోదీ ప్రభుత్వం కొద్దిమంది కార్పొరేట్ సంస్థలకు సంపదను కట్టబెడుతోందని ఆరోపించారు. దేశ నిర్మాణంలో నిపుణుల అనుభవాన్ని, సలహాలను వినియోగించుకోవడం ద్వారా ప్రజలకు ఉపయోగపడే విధానాలు రూపొందించవచ్చన్నారు.

**పారదర్శక పాలనకు ‘షాడో మినిస్ట్రీ’**

ప్రభుత్వాల పనితీరును స్వతంత్రంగా పరిశీలించి, లోపాలను ఎప్పటికప్పుడు గుర్తించే వ్యవస్థ అవసరమని మధుయాష్కీ అభిప్రాయపడ్డారు. అమెరికాలో ఉన్న తరహాలో ‘షాడో మినిస్ట్రీ’ వ్యవస్థ ఉంటే పరిపాలనలో పారదర్శకత పెరుగుతుందని చెప్పారు. తెలంగాణలో 22ఏ జాబితా భూముల విషయంలో కొందరు అధికారులు రెవెన్యూ మంత్రి, ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. ఇలాంటి వ్యవస్థ ఉంటే లోపాలను గుర్తించి, ప్రజలకు ఉపయోగపడే విధానాలను రూపొందించే అవకాశం ఉంటుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జీవో 118లోని లోపాలను గుర్తించి రెవెన్యూ మంత్రి, అధికారులకు సూచనలు చేశానని, అనంతరం మార్పులతో కొత్త నిబంధనలు పొందుపరిచారని వివరించారు. బ్రిటిష్ పాలకులతో చేతులు కలిపి స్వాతంత్ర్య ఉద్యమాన్ని వ్యతిరేకించిన చరిత్ర బీజేపీ వారసత్వానికి ఉందని మధుయాష్కీ విమర్శించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ముందు మోదీ ప్రభుత్వం తలవంచుతోందని, చైనా భారత భూభాగాన్ని ఆక్రమించినా కేంద్రం స్పందించడం లేదని ఆరోపించారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం ప్రాణాలు అర్పించిన ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల సేవలను గుర్తుచేశారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, పౌర హక్కుల పరిరక్షణ కోసం వృత్తి నిపుణులు ముందుకు వచ్చి సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# మూడు దశల్లో సమగ్ర భూసర్వే

(మొదటిపేజీ తరువాయి)

స్వీకరణకు నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. వచ్చే నెలాఖరుకు తొలి దశను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. శనివారం సచివాలయంలో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలు ఉండగా, హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో తొలి దశలో 2,720 గ్రామాలను ఎంపిక చేసినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే 411 రోవర్లను కొనుగోలు చేయగా, అదనంగా మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారయ్యాయని చెప్పారు. డీజీపీఎస్, జీఐఎస్, క్యూజీఐఎస్ సాంకేతికతతో భూముల కొలతలను కచ్చితంగా నిర్వహించి, వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరుస్తామన్నారు. రీసర్వే పూర్తయిన తర్వాత ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించి, భూదార్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. డిజిటల్ సర్వే సమాచారాన్ని భూ భారతి పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షలుగా ఉన్న సర్వే నంబర్లు ప్రస్తుతం 2.29 కోట్లకు పెరిగాయని వివరించారు.

**పైపుల కాలువలతో వేల ఎకరాల భూమి ఆదా**

సీతారామ ఎత్తిపోతల పథకం పంపిణీ కాలువలను సాంకేతికంగా సాధ్యమైన ప్రాంతాల్లో పైపుల వ్యవస్థగా మార్చాలని మంత్రి ప్రతిపాదించారు. ప్రస్తుతం సుమారు 11,162 ఎకరాల భూమి అవసరం కాగా, పైపుల విధానంతో ఆ అవసరాన్ని 1,395 ఎకరాలకు తగ్గించవచ్చని అంచనా వేశారు. దీంతో 9,767 ఎకరాల భూమి ఆదా కావడంతో పాటు భూసేకరణ వ్యయంలో రూ.2,148.74 కోట్ల వరకు తగ్గింపు సాధ్యమవుతుందని తెలిపారు. ఈ పథకం ద్వారా మొత్తం 6,74,387 ఎకరాలకు సాగునీటి ప్రయోజనం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

**పాలేరులో త్వరలో భూదార్ పట్టాల పంపిణీ**

తన పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి మండలం కొంగర గ్రామ పరిధిలో 665 ఎకరాలకు వంద శాతం రీసర్వే పూర్తిచేసినట్లు మంత్రి తెలిపారు. త్వరలో అక్కడ భూదార్ పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. సర్వేకు ముందు పట్టాదారులకు నోటీసులు ఇవ్వాలని, ఒకటి రెండు రోజుల ముందుగా గ్రామాల్లో చాటింపు వేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములు, ప్రైవేటు భూములు, గ్రామ కంఠం హద్దులను స్పష్టంగా గుర్తించిన తర్వాతే సర్వే చేపట్టాలని సూచించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

# సారే కావాలంటున్నారు.. కేసీఆరే మళ్లీ రావాలంటున్నారు..

(మొదటిపేజీ తరువాయి)

అత్యంత కీలకమని పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ రంగాలకు చెందిన పట్టభద్రులు అధికంగా ఉన్న హనుమకొండలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పరిసరాల్లోని పట్టభద్రులను గుర్తించి, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయించాలని కోరారు. మనసుపెట్టి పనిచేస్తే మూడు రోజుల్లోనే పెద్ద సంఖ్యలో పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయవచ్చని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కు హనుమకొండ గుండెకాయ లాంటిదని, ఇక్కడి నుంచే నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని పిలుపునిచ్చారు.

**ప్రజా ఉద్యమాల్లో బీఆర్ఎస్ ముందుంటుంది**

ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ మూడేళ్లుగా అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. హనుమకొండలో తనతోపాటు పార్టీ శ్రేణులపై అణచివేతలు, కేసులు నమోదవుతున్నా ప్రజా ఉద్యమాలను కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా బీఆర్ఎస్ అండగా ఉంటుందనే నమ్మకం ఉందన్నారు. పట్టభద్రుల ఓటరు నమోదు కోసం ఇప్పటికే డివిజన్లవారీగా సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశామని, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని వివరించారు. క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు.

**ఎమ్మెల్సీ గెలుపుతో పార్టీకి కొత్త ఊపు**

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సమాజం కేసీఆర్ నాయకత్వాన్ని తిరిగి కోరుకుంటోందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధిస్తే స్థానిక సంస్థల ఎన్నికలపైనా ప్రభావం చూపి, రాష్ట్రంలో పార్టీ తిరిగి అధికారంలోకి రావడానికి అవకాశం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. సర్పంచ్ ఎన్నికల తర్వాత ఎంపీటీసీ, కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించకపోవడానికి బీఆర్ఎస్ గెలుస్తుందనే భయమే కారణమని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ నాయకులే వెనుకాడుతున్నారని వ్యాఖ్యానించారు. గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైనా గట్టి పోటీ ఇచ్చానని గుర్తుచేశారు. నిరుద్యోగుల పోటీ పరీక్షల్లో అవినీతి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం ప్రశ్నిస్తూ పోరాటం సాగించానని తెలిపారు. రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 12 నియోజకవర్గాల్లో ఓటరు నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి అర్హులైన పట్టభద్రులను నమోదు చేయించాలని సూచించారు. పండుగలు, ఇతర సందర్భాల్లో స్వగ్రామాలకు వచ్చే పట్టభద్రులను కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇతర వృత్తుల్లో ఉన్న పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్లు, రాష్ట్రస్థాయి నాయకులు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పండుగకు పల్లెబాట.. హైవేలపై ట్రాఫిక్ పాట్లు!




(మొదటిపేజీ తరువాయి)

దీంతో ప్రయాణికులు ట్రాఫిక్ ఇబ్బందులతో సతమతమవుతున్నారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై విస్తరణ, ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ట్రాఫిక్ రద్దీకి కారణమవుతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. సుమారు 3 కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరగా, పట్టణాన్ని దాటేందుకు 45 నిమిషాలకు పైగా సమయం పడుతోంది. చిట్యాల వద్ద కూడా ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. అక్కడ గంటకుపైగా ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పంతంగి టోల్‌ప్లాజా వద్ద రద్దీ పెరగడంతో విజయవాడ వైపు వెళ్లే వాహనాల కోసం 24 టోల్ బూత్‌లలో 16 తెరిచి ఉంచారు. హైదరాబాద్-వరంగల్, హైదరాబాద్-కరీంనగర్ రహదారులతో పాటు యాదాద్రి టోల్‌ప్లాజా వద్ద కూడా వాహనాల రద్దీ కొనసాగుతోంది. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చేపడుతున్న చర్యలు సరిపోవడం లేదని పలువురు వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**బస్టాండ్లలో రద్దీ.. ప్రత్యేక బస్సుల ఛార్జీలపై అసహనం**

సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్ బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతున్నామని ఆర్టీసీ చెబుతున్నా, ప్రయాణికులకు సరిపడా బస్సులు అందుబాటులో లేవని పలువురు చెబుతున్నారు. బస్సులు కిక్కిరిసి నడుస్తుండటంతో ప్రైవేటు వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రత్యేక బస్సుల పేరుతో 50 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారంటూ ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్వరగా ఇంటికి చేరుకోవాలన్న ఆశతో బయలుదేరిన వారికి హైవేలపై ట్రాఫిక్ జామ్‌లు పండుగ ప్రయాణాన్ని ఇబ్బందికరంగా మారుస్తున్నాయి.

# షార్లెట్‌లో తెలుగు సంబురాలు.. మిషిగన్‌లో నాట్స్ చాప్టర్ ప్రారంభం




**అమెరికా:** అమెరికాలోని షార్లెట్‌లో నిర్వహించిన ‘షార్లెట్ తెలుగు సంబరాలు-2026’ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు, యువత ప్రదర్శించిన శాస్త్రీయ సంగీతం, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తొమ్మిది శాస్త్రీయ అంశాలతో నిర్వహించిన సైన్స్ ఫెస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తానా, జీటీఏ, ఆప్టా తదితర తెలుగు సంస్థలు భాగస్వాములయ్యాయి. నాట్స్ అధ్యక్షుడు రాజ్ అల్లాడా హాజరయ్యారు. ఈ సందర్భంగా 800 కొత్త రిజిస్ట్రేషన్లు నమోదైనట్లు నిర్వాహకులు తెలిపారు. మరోవైపు, తెలుగు సంస్కృతి పరిరక్షణ, సామాజిక సేవల విస్తరణ లక్ష్యంగా నార్త్ అమెరికన్ తెలుగు సొసైటీ (నాట్స్) మిషిగన్ చాప్టర్‌ను ఫార్మింగ్టన్ హిల్స్‌లో ప్రారంభించారు. చాప్టర్ కోఆర్డినేటర్‌గా శ్రీదేవి మణేపల్లి, జాయింట్ కోఆర్డినేటర్‌గా మహి బొల్లవరం నియమితులయ్యారు. రవి చాలంటి, హేమ సూరపరాజు, జ్యోతి జవ్వాది, అనుపమ దివాకర్లకు వివిధ బాధ్యతలు అప్పగించారు. నాట్స్ చైర్మన్ కిషోర్ కంచర్ల, అధ్యక్షుడు రాజ్ అల్లాడా మాట్లాడుతూ తెలుగు సమాజానికి సేవలందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా మనోరమ గాంధీ, సంధ్య శ్రీ ఆత్మకూరి, మనబడి, సన్నీ రెడ్డి, డాక్టర్ హరినాథ్ పోలిచెర్లను సత్కరించారు. విద్యార్థుల కూచిపూడి ప్రదర్శనలు అలరించాయి. మహిళా సాధికారత, యువ నాయకత్వం, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు ప్రతి మూడు నెలలకు ఒక ప్రధాన సేవా కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. వివిధ తెలుగు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. పీఆర్వో జీకే మీడియా గణేష్ కుమార్

# పిల్లల లైంగిక దోపిడీ కంటెంట్‌పై సుప్రీం కొరడా!

(మొదటిపేజీ తరువాయి)

జరగకుండా మధ్యవర్తిత్వ సంస్థలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేసింది. సోషల్ మీడియా అల్గారిథంల ద్వారా నిషేధిత కంటెంట్ పరోక్షంగా ప్రచారం పొందే అవకాశాలపైనా ధర్మాసనం దృష్టి సారించింది. ప్రత్యక్ష లింకులు ఇవ్వకపోయినా, సాంకేతిక వ్యవస్థల ద్వారా అలాంటి కంటెంట్ వినియోగదారులకు చేరితే చట్ట నిబంధనలను తప్పించుకునే పరిస్థితి ఏర్పడవచ్చని పేర్కొంది. పిల్లల రక్షణ కోసం రూపొందించిన చట్టాలను అధిగమించేలా కంటెంట్‌ను ప్రోత్సహించడం లేదా వ్యాప్తి చేయడం జరగకూడదని స్పష్టం చేసింది.

**ఆదేశాల అమలులో నిర్లక్ష్యంపై అసంతృప్తి**

2024లోనే సుప్రీంకోర్టు ఈ అంశంపై ఆదేశాలు జారీ చేసినప్పటికీ, సోషల్ మీడియా సంస్థలు వాటిని సమర్థంగా అమలు చేయడం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. రెండేళ్లు దాటినా చెప్పుకోదగ్గ పురోగతి కనిపించడం లేదని పేర్కొంది. ఇటీవలి కాలంలో వెలుగులోకి వచ్చిన వార్తలు పిల్లల ఆన్‌లైన్ భద్రతపై మరింత ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపింది. పిల్లల లైంగిక దోపిడీకి సంబంధించిన కంటెంట్‌ను అరికట్టడంలో కేవలం నిషేధాలు విధించడం సరిపోదని, దాన్ని గుర్తించడం, తొలగించడం, మళ్లీ వ్యాప్తి చెందకుండా నిరోధించడం కూడా ముఖ్యమని ధర్మాసనం ఆదేశాల సారాంశం స్పష్టం చేస్తోంది. ఈ బాధ్యతను సోషల్ మీడియా సంస్థలు, కేంద్ర ప్రభుత్వం, సంబంధిత నియంత్రణ వ్యవస్థలు సమన్వయంతో నిర్వర్తించాల్సి ఉంటుంది. సమాచార సాంకేతిక చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించే సోషల్ మీడియా మధ్యవర్తులపై భారీ జరిమానాలు విధించే వ్యవస్థను రూపొందించే అంశాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. జరిమానా మొత్తాన్ని నిర్ణయించేటప్పుడు ఉల్లంఘన తీవ్రత, అది ఎంతకాలం కొనసాగింది, ఎన్ని పర్యాయాలు పునరావృతమైంది, సంబంధిత సంస్థ వార్షిక టర్నోవర్ ఎంత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. నిషేధిత కంటెంట్‌ను పేవాల్ లేదా ఇతర సబ్‌స్క్రిప్షన్ విధానాల ద్వారా అందుబాటులో ఉంచి ఆదాయం పొందితే, ఆ కంటెంట్ ద్వారా సంబంధిత ప్లాట్‌ఫామ్ సంపాదించిన మొత్తాన్ని తిరిగి స్వాధీనం చేసుకునే విధానం ఉండాలని కూడా సూచించింది. తద్వారా ఇలాంటి కంటెంట్ ద్వారా ఆదాయం పొందే అవకాశాలను అడ్డుకోవడంతోపాటు, నిబంధనల ఉల్లంఘనలను సంస్థలు తీవ్రంగా పరిగణించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

**హానికర కంటెంట్ తొలగింపునకు సాంకేతికత**

పిల్లల లైంగిక దోపిడీకి సంబంధించిన కంటెంట్‌ను వేగంగా గుర్తించి తొలగించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ధర్మాసనం సూచించింది. ప్రముఖ సోషల్ మీడియా మధ్యవర్తిత్వ సంస్థలు తమ ప్లాట్‌ఫామ్‌లలోని ఇలాంటి కంటెంట్‌ను గుర్తించి తొలగించేందుకు పర్సెప్చువల్ హాష్ మ్యాచింగ్, యూఆర్ఎల్ జాబితాల వంటి సాంకేతిక పద్ధతులను ఉపయోగించేలా కేంద్ర ప్రభుత్వం ప్రామాణిక కార్యాచరణ విధానాలను రూపొందించాలని ఆదేశించింది. ఇదే లక్ష్యంతో జాతీయ స్థాయిలో హాష్, యూఆర్ఎల్ జాబితా డేటాబేస్‌ను ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ వ్యవస్థ ద్వారా నిషేధిత కంటెంట్‌ను గుర్తించడం, తొలగించడం మరింత సమర్థంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. కంటెంట్ ఒకసారి తొలగించిన తర్వాత ఇతర లింకులు లేదా మార్గాల ద్వారా మళ్లీ అందుబాటులోకి రాకుండా అడ్డుకునేందుకు సాంకేతిక పరిష్కారాలను ఉపయోగించడం కీలకమని ఈ ఆదేశాలు సూచిస్తున్నాయి.

**పిల్లల ఇంటర్నెట్ హక్కులకూ రక్షణ**

ఇంటర్నెట్ వినియోగ హక్కు రాజ్యాంగంలోని 21వ అధికరణ, 19(1)(ఎ) అధికరణలతో ముడిపడి ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ హక్కులు పిల్లలకూ వర్తిస్తాయని తెలిపింది. పిల్లల భద్రతను కాపాడటంతోపాటు వారి స్వేచ్ఛను గౌరవించడం పరస్పర విరుద్ధమైన అంశాలు కావని స్పష్టం చేసింది. కొన్ని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల వినియోగంపై ఆంక్షలు విధించినంత మాత్రాన పిల్లలు ఇంటర్నెట్‌కు పూర్తిగా దూరమవుతారని భావించలేమని ధర్మాసనం పేర్కొంది. అందువల్ల పిల్లలు ఇంటర్నెట్‌ను వినియోగించకుండా పూర్తిగా నిషేధించడం సమస్యకు పరిష్కారం కాదని తెలిపింది. హానికర కంటెంట్‌ను గుర్తించి తొలగించడం, దాని వ్యాప్తిని అడ్డుకోవడం, పిల్లల భద్రతను కాపాడటం వంటి చర్యలపై దృష్టి పెట్టాలని సూచించింది. పిల్లలకు సంబంధించిన అశ్లీల కంటెంట్‌ను చూడటం, డౌన్‌లోడ్ చేయడం వంటి చర్యలు పోక్సో చట్టం, సమాచార సాంకేతిక చట్టం కింద నేరాలుగా పరిగణించే అంశాన్ని సుప్రీంకోర్టు 2024 సెప్టెంబర్ 23న కూడా ప్రస్తావించింది. తాజా ఆదేశాలతో పిల్లల ఆన్‌లైన్ భద్రతకు సంబంధించి సోషల్ మీడియా సంస్థల బాధ్యత, చట్టాల అమలు, సాంకేతిక పరిష్కారాల అవసరాన్ని ధర్మాసనం మరోసారి స్పష్టం చేసింది.

## క్రీడలతోనే సంపూర్ణ మానసిక ఉల్లాసం

- యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపు



**కాకతీయ, వర్ధన్నపేట:** క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం, ప్రశాంతతను అందిస్తాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని పిలుపునిచ్చారు. శనివారం వర్ధన్నపేట మండలం డీసీ తండా శివారులో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో ఆయన క్రికెట్ ఆడి సందడి చేశారు. యువత కేరింతలతో మైదానంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి, యువతను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం తండాలు, గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందని ఎర్రబెల్లి పేర్కొన్నారు. ఆటలకు మైదానాలు లేక ఇబ్బందులు పడిన గ్రామీణ యువతకు ఇవి ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు.

**రాయపర్తిలో ప్రత్యేక పూజలు**

రాయపర్తి మండలం తిరుమలాయపల్లిలో జరుగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎర్రబెల్లి దయాకర్‌రావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం తిరుమలాయపల్లి, గణేష్‌కుంట తండా, శివరాంపురం, బురహాన్‌పల్లి గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శించి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మండల, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామంలో శాంతిభద్రతలు కాపాడాలి

- దసరా వివాదానికి చట్టప్రకారం పరిష్కారం చూపాలి
- రాంపురం సర్పంచ్ రడం భరత్ వినతి



**కాకతీయ, గీసుగొండ:** రాంపురం గ్రామంలో దసరా పండుగ నిర్వహణపై నెలకొన్న వివాదాన్ని చట్టప్రకారం పరిష్కరించి, శాంతిభద్రతలు కాపాడాలని సర్పంచ్ రడం భరత్ ఉన్నతాధికారులను కోరారు. ఈ మేరకు వరంగల్ పోలీస్ కమిషనర్, గీసుగొండ సీఐ, తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతి పత్రాలు సమర్పించారు. గతంలో గీసుగొండ గ్రామ పంచాయతీలో ఉపగ్రామంగా ఉన్న రాంపురం 2018లో ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడిందని తెలిపారు. ఉమ్మడి పంచాయతీగా ఉన్నప్పటి నుంచి గీసుగొండకు చెందిన వీరగోని వంశస్థులు రాంపురంలో దసరా వేడుకలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రత్యేక పంచాయతీ ఏర్పాటయ్యాక గ్రామస్థులే వేడుకలు నిర్వహించుకోవాలని నిర్ణయించడంతో ఇరువర్గాల మధ్య విభేదాలు తలెత్తినట్లు వివరించారు. గ్రామసభలోనూ ఈ మేరకు తీర్మానం చేసినట్లు తెలిపారు. పండుగ సందర్భంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, వివాదాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని భరత్ విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజలు ప్రశాంతంగా దసరా జరుపుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## బతుకమ్మ సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రతీక

- తెలంగాణ ఆత్మకు ప్రతిరూపం పూల పండుగ
- మహిళల ఐక్యత, ఆత్మగౌరవానికి నిదర్శనం
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**కాకతీయ, హైదరాబాద్ :** బతుకమ్మ పండుగ సామాజిక న్యాయం, సమానత్వం, మహిళల ఐక్యతకు ప్రతిరూపమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ప్రత్యేకించి ఆడబిడ్డలకు శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆత్మకు ప్రతిరూపమని పేర్కొన్నారు. వివిధ రకాల పూలు కలిసి బతుకమ్మగా రూపుదిద్దుకున్నట్లే భిన్న వర్గాలు, విభిన్న సంస్కృతులకు చెందిన ప్రజలను ఈ పండుగ ఒక్కతాటిపైకి తెస్తుందని అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ మహిళలు ఆటపాటలతో బతుకమ్మ వేడుకలు జరుపుకోవడం తెలంగాణ సాంస్కృతిక వైభవానికి నిదర్శనమని పేర్కొన్నారు. మహిళల సంక్షేమం, అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. సద్దుల బతుకమ్మ ప్రతి ఇంటా ఆనందాలు నింపాలని, కుటుంబాల్లో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు తరతరాల పాటు కొనసాగాలని, బతుకమ్మ మహిళల ఐక్యతకు, సామాజిక సామరస్యానికి మరింత బలాన్నివ్వాలని భట్టి విక్రమార్క అభిలషించారు.

## అక్రమ పేలుడు పదార్థాలు స్వాధీనం

- 475 జిలెటిన్ స్టిక్స్, 3,000 మీటర్ల డిటోనేటింగ్ వైర్ పట్టివేత
- రెండు కంప్రెసర్ ట్రాక్టర్లు సీజ్.. ఒకరి అరెస్ట్



**కాకతీయ, కరీంనగర్:** అక్రమంగా పేలుడు పదార్థాలు కలిగి ఉన్న వ్యక్తిని కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు సైదాపూర్ మండలం సోమారం గ్రామ శివారులో వ్యవసాయ బావి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామడుగు మండలం శ్రీరాములపల్లెకు చెందిన వేముల భూమయ్య (45) వద్ద పేలుడు పదార్థాలు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 475 జిలెటిన్ స్టిక్స్, సుమారు 3,000 మీటర్ల డిటోనేటింగ్ వైర్ (3 బండిళ్లు), రెండు కంప్రెసర్ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్ల నంబర్లు టీఎస్ 02 యూసీ 2690, టీజీ 02 టీ 0082గా పోలీసులు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు, ట్రాక్టర్లను తదుపరి చట్టపరమైన చర్యల కోసం సైదాపూర్ పోలీసులకు అప్పగించినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ తెలిపింది.

## జోగాపూర్‌లో దొంగల చేతివాటం!

- రూ.80 వేల నగదు, బంగారు, వెండి ఆభరణాలు అపహరణ
- ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడిన దుండగులు
- ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు



**కాకతీయ, చందుర్తి:** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం జోగాపూర్‌లో అర్ధరాత్రి చోరీ ఘటన కలకలం రేపింది. గుర్తుతెలియని దుండగులు ఓ ఇంట్లోకి చొరబడి నగదు, బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. ఉదయం చోరీ విషయం వెలుగులోకి రావడంతో బాధితుడు ముత్యాల సంతోష్ పోలీసులను ఆశ్రయించారు. సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. దుండగులు రూ.80 వేల నగదు, రెండు తులాల బంగారు నెక్లెస్, మూడు బంగారు చైన్లు, రెండు జతల కమ్మలు, రెండు ఉంగరాలు, మూడు జతల వెండి పట్టగొలుసులు, రెండు వెండి మొలతాళ్లను ఎత్తుకెళ్లారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. వేలిముద్రల నిపుణుల బృందం ఆధారాలను సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చోరీకి పాల్పడిన వారి ఆచూకీ కోసం పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. దుండగులు ఎలా వచ్చారు, ఎలా చోరీకి పాల్పడ్డారనే వివరాలు తెలియాల్సి ఉంది.

# 20న ట్రైసిటీలో ట్రాఫిక్ ఆంక్షలు

- మధ్యాహ్నం 3 నుంచి 21న తెల్లవారుజామున 3 గంటల వరకు అమలు
- భారీ వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గాలు
- భక్తుల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు
- ఎన్. శ్వేత, వరంగల్ పోలీస్ కమిషనర్



**కాకతీయ, వరంగల్ బ్యూరో :** ఉర్సు రంగలీల మైదానంలో నిర్వహించే దసరా ఉత్సవాల సందర్భంగా ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. ఈ నెల 20న మధ్యాహ్నం 3 గంటల నుంచి 21న తెల్లవారుజామున 3 గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని, ఉర్సు గుట్టకు వచ్చే భక్తులు కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలను నిలపాలని సూచించారు. ఖమ్మం నుంచి వరంగల్ మీదుగా కరీంనగర్, హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు పున్నేలు క్రాస్ నుంచి ఐనవోలు ఆర్చ్, వెంకటాపురం, కరుణాపురం మీదుగా వెళ్లాలని కమిషనర్ సూచించారు. కరీంనగర్ నుంచి ఖమ్మం వెళ్లే వాహనాలు కేయూసీ, పెద్దమ్మగడ్డ, హనుమాన్ జంక్షన్, పోచమ్మ మైదాన్, కాశిబుగ్గ, తెలంగాణ జంక్షన్, ఫోర్ట్ రోడ్ జంక్షన్ మీదుగా ప్రయాణించాలి. హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్లే వాహనాలు కరుణాపురం, వెంకటాపురం, ఐనవోలు, పున్నేలు క్రాస్ మీదుగా వెళ్లాలని తెలిపారు.

**భక్తుల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్**

ఉర్సు గుట్టకు వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఎన్. శ్వేత వివరించారు. హనుమకొండ హంటర్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలను కొలంబో ఆసుపత్రి, బీఆర్ నగర్ ఎదురుగా గానుగ ఆయిల్ పాయింట్ సమీపంలో, ఆకుతోట ఫంక్షన్ హాల్, నాని గార్డెన్, జేఎస్ఎం పాఠశాల వద్ద పార్కింగ్ చేసుకోవాలి. కడిపికొండ నుంచి వచ్చే వాహనాలకు భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో, ఆర్టీఓ జంక్షన్ నుంచి వచ్చే వాహనాలకు లల్లీ ఫంక్షన్ హాల్ ఓపెన్ ప్లేస్, తాళ్ల పద్మావతి కళాశాల వద్ద పార్కింగ్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కరీమాబాద్ నుంచి వచ్చే వాహనాలను భీరన్న గుడి సమీపంలో నిలపాలని సూచించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులు ట్రాఫిక్ ఆంక్షలను గమనించి, కేటాయించిన పార్కింగ్ ప్రదేశాలను వినియోగించుకోవాలని పోలీస్ కమిషనర్ కోరారు. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు సహకరించి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.

## కాళేశ్వరం వైఫల్యాలతోనే నేటి కష్టాలు

- కల్వకుంట్ల కుటుంబానికే నీళ్లు, నిధులు, నియామకాలు
- తెలంగాణ నినాదాన్ని స్వార్థం కోసం వాడుకున్న కేసీఆర్
- ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూరి వెంకట్



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ ప్రజల ఆకాంక్షలైన నీళ్లు, నిధులు, నియామకాలు గత పదేళ్లలో కల్వకుంట్ల కుటుంబానికే పరిమితమయ్యాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూరి వెంకట్ విమర్శించారు. తెలంగాణ సాధన కోసం సబ్బండ వర్గాల ప్రజలు పోరాడితే, ఆ ఫలాలను మాత్రం కేసీఆర్ కుటుంబం అనుభవించిందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుత కష్టాలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలే కారణమని పేర్కొన్నారు. తెలంగాణ తెచ్చుకున్నదే నీళ్లు, నిధులు, నియామకాల కోసం అని, కేసీఆర్ ఆ నినాదాన్ని తన కుటుంబ స్వార్థం కోసం ఉపయోగించుకున్నారని బల్మూరి వెంకట్ ఆరోపించారు. కాసుల కోసం కక్కుర్తిపడి నిర్మించాల్సిన చోట ప్రాజెక్టులు నిర్మించలేదని, కాళేశ్వరం నీళ్లు తన ఫామ్‌హౌస్‌కు చేరేలా ప్రణాళికలు రూపొందించుకున్నారని విమర్శించారు. నియామకాల విషయంలోనూ కుటుంబ సభ్యులు హరీశ్‌రావు, కేటీఆర్, కవిత, సంతోష్‌రావు, ఇతర బంధువులకు ప్రాధాన్యమిచ్చారని ఆరోపించారు. నిధుల విషయంలో ప్రభుత్వ ఖజానా ఖాళీ కాగా, బీఆర్ఎస్ ఖాతా విరాళాలతో నిండిందని బల్మూరి వెంకట్ విమర్శించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని నిధులను దారి మళ్లించారని, భూములు, వ్యాపారాలను పెంచుకున్నారే తప్ప ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉన్న పరిస్థితుల్లో తెలంగాణలో కరువుకు ప్రజా ప్రభుత్వమే కారణమన్నట్లు బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం అవివేకమని అన్నారు. హరీశ్‌రావు చేస్తున్న ధర్నా రైతుల కోసం కాదని, వారి మామ ఫామ్‌హౌస్‌కు నీళ్లు అందించాలనే ఉద్దేశంతోనేనని విమర్శించారు. గత పదేళ్ల పాలనలో ఏం జరిగిందో ప్రజలు గమనించే బీఆర్ఎస్‌ను అధికారానికి దూరం చేశారని పేర్కొన్నారు. నిపుణుల సలహాలు తీసుకుని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి ఉంటే ప్రస్తుత కష్టకాలంలో అది ఉపయోగపడేదని అభిప్రాయపడ్డారు. గతంలో చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ప్రజా ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు ఎన్ని ఆరోపణలు చేసినా వాస్తవ పరిస్థితులు ప్రజలకు తెలుసని ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూరి వెంకట్ స్పష్టం చేశారు.

## వర్షాభావాన్ని సమర్థంగా ఎదుర్కోవాలి

- వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి
- తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించాలి
- ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి డా. టీ.కే. శ్రీదేవి

**కాకతీయ, ములుగు:** వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ కార్యదర్శి డా. టీ.కే. శ్రీదేవి సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, విద్యుత్, పశుసంవర్ధక రంగాలపై సమీక్షించారు. తక్కువ నీరు అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని, పట్టణాలు, ప్రధాన గ్రామ పంచాయతీల్లో భవనాలపై కూల్ రూఫ్స్ ఏర్పాటు చేసి విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ములుగు కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు మాట్లాడుతూ జిల్లాలోని పది మండలాల్లో సాధారణ వర్షపాతంతో పోలిస్తే 12 శాతం లోటు నమోదైందన్నారు. విద్యుత్ డిమాండ్ 103 మెగావాట్ల నుంచి 243 మెగావాట్లకు పెరిగిందని తెలిపారు. సుమారు 26 వేల ఎకరాల్లో వరికి బదులుగా పెసర, ఇతర పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించినట్లు వివరించారు. ప్రస్తుతం తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేవని, పశుగ్రాసం అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు తీసుకుంటున్న చర్యలను ప్రత్యేక అధికారి అభినందించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 23న కలెక్టరేట్ ఎదుట ధర్నా

- రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి
- విద్యుత్, సాగునీటి సమస్యలు పరిష్కరించాలి
- బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



**కాకతీయ, శంకరపట్నం:** రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం శంకరపట్నంలోని మాధవసాయి గార్డెన్స్‌లో మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. విద్యుత్ కొరత, సాగునీటి సమస్యలతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని అన్నారు. రైతులకు జరుగుతున్న నష్టంపై ప్రభుత్వం బాధ్యత వహించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై బీజేపీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ నెల 23న జరిగే ధర్నాలో శంకరపట్నం మండల రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు కొమురయ్య, సర్పంచ్ వెన్నం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## జనసేన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ గడల

- పవన్ కల్యాణ్ చేతుల మీదుగా నియామక పత్రం అందజేత
- ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన డాక్టర్ గడల శ్రీనివాసరావుకు పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గడల శ్రీనివాసరావు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా పూర్తి స్థాయి బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ వైద్య, ప్రజారోగ్య రంగంలో ఉన్నతాధికారిగా పనిచేసిన గడల శ్రీనివాసరావు గతంలో రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుడిగా బాధ్యతలు నిర్వహించారు. ప్రజారోగ్య వ్యవస్థకు సంబంధించిన పరిపాలనా అంశాల్లో పనిచేశారు. 2026లో జనసేన పార్టీలో చేరిన ఆయనకు ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా అవకాశం కల్పించారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియామకం కావడం ఆయన రాజకీయ ప్రస్థానంలో మరో కీలక పరిణామంగా జనసేన రాష్ట్ర కార్యాలయం పేర్కొంది.

## బతుకమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**కాకతీయ, నెల్లికుదురు :** మండలంలోని శ్రీ రామగిరి గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన బతుకమ్మ విగ్రహాన్ని శనివారం డిసిసి అధ్యక్షులు ఉమా మురళి నాయక్ గ్రామ సర్పంచ్ మాధురి ప్రశాంత్ లతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తరతరాల నుంచి వస్తున్న ఆచార బతుకమ్మ పండుగ సంప్రదాయాలను మహిళలు ఆటపాటలు కోలాటాలతో పండగ జరుపుకోవడం సంతోషకరమన్నారు.ఈ కార్యక్రమం లో , మాజీ అధ్యక్షులు గొల్లపెల్లి ప్రభాకర్, ఉప సర్పంచ్ రామగిరి సుమన్, డిసిసి మాజీ ఉపాధ్యక్షులు బాలాజీ నాయక్, వివిధ గ్రామ సర్పంచ్ లు, బాలకృష్ణ, ఇట్టే లీలా దేవేందర్, శ్రీనివాస్, కరుణ మధు నాయక్ ఈ గ్రామస్తులు బెల్లి నర్సయ్య, దోనికాని మల్లయ్య, మద్దెల సమ్మయ్య, ఆవుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి!

- ఈ నెల 23న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి
- సాగు సమస్యలు పరిష్కరించి పంటలను కాపాడాలి
- బీజేపీ చందుర్తి మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్

**కాకతీయ, చందుర్తి :** రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, సాగు సమస్యలను పరిష్కరించి పంటలను కాపాడాలని బీజేపీ చందుర్తి మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 23న నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, రైతులకు పిలుపునిచ్చారు. మండలంలో నిర్వహించిన పార్టీ కార్యశాలకు జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు చిలం రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేందర్ మాట్లాడుతూ విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడం, సాగునీటి ఇబ్బందులతో పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పంటలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, రైతుల హక్కుల కోసం బీజేపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. అనంతరం నూతనంగా నియమితులైన పెరుక రంజిత్, తీపిరెడ్డి మనోహర్‌రెడ్డి, పాటి సుధాకర్, బందెల వెంకటేష్, ముదపల్లి ముఖేష్ గౌడ్‌లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోత దశలోనైనా నీటిని విడుదల చేయండి!

- పంటలు ఎండిపోతున్నా పట్టించుకోరా?
- ఎల్‌ఎండీ నుంచి సాగునీటి విడుదలకు డిమాండ్
- మండల అధ్యక్షుడు గంట మహిపాల్ ఆధ్వర్యంలో రాస్తారోకో



**కాకతీయ, శంకరపట్నం :** కోత దశకు చేరుకున్న వరి పంటలను కాపాడేందుకు ఎల్‌ఎండీ నుంచి వెంటనే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మండల అధ్యక్షుడు గంట మహిపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని రైతుల సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో నీటి కొరత ఏర్పడటంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి కష్టపడి పండించిన వరి పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పంట కోతకు సిద్ధమైన తరుణంలో నీరు అందక నష్టపోతే రైతుల పరిస్థితి ఏమిటని నిలదీశారు. రైతుల కష్టాలను గుర్తించి ఎల్‌ఎండీ నుంచి తక్షణమే సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఆందోళనలో మాజీ జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్, ఉప సర్పంచ్ ఆకుబత్తిని విజయ్‌కుమార్, నాయకులు కొత్తపెల్లి రవి, గుర్రం శ్రీకాంత్‌గౌడ్, తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్, గొడిశాల రాములు, అలీమ్, గూళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల మోటార్లు మాయం!

- రూ.30 వేల విలువైన పంపుసెట్లు చోరీ





**కాకతీయ, శంకరపట్నం:** శంకరపట్నం మండలం కరీంపేటలో వ్యవసాయ మోటార్ల చోరీ కలకలం రేపుతోంది. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ముగ్గురు రైతులకు చెందిన విద్యుత్ మోటార్లను అపహరించారు. శనివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు మోటార్లు కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. గ్రామానికి చెందిన ములుగురి స్వామి, బొజ్జ అశోక్, వనపర్తి రాజేశంలకు చెందిన మోటార్లు చోరీకి గురయ్యాయి. వీటి విలువ సుమారు రూ.30 వేల వరకు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. ప్రస్తుతం పంటలకు సాగునీరు అందించాల్సిన కీలక సమయంలో మోటార్లు చోరీకి గురికావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, నిందితులను గుర్తించి మోటార్లను తిరిగి ఇప్పించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పరికరాల చోరీలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ కోతలపై భగ్గుమన్న బీఆర్ఎస్

- వేములవాడ సబ్‌స్టేషన్ ఎదుట రైతులతో మహా ధర్నా
- 24 గంటల ఉచిత విద్యుత్ పునరుద్ధరించాలి
- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు



**కాకతీయ, వేములవాడ:** రైతుల పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ప్రశ్నించారు. విద్యుత్ కోతలు, సాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం వేములవాడలోని బీసీ హాస్టల్ సమీప సబ్‌స్టేషన్ ఎదుట రైతులతో కలిసి మహా ధర్నా నిర్వహించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అందించిన 24 గంటల ఉచిత విద్యుత్‌ను కొనసాగించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని చల్మెడ విమర్శించారు. విద్యుత్ కోతలతో వ్యవసాయ మోటార్లు పనిచేయక పంటలకు నీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని వినియోగించుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే మూడు, నాలుగు వారాలపాటు రోజుకు కనీసం ఆరు నుంచి ఎనిమిది గంటలు నాణ్యమైన విద్యుత్ అందించాలని, నీటి ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించి చెరువులు, కుంటలను నింపాలని కోరారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువతలో ఫిట్‌నెస్‌పై పెరుగుతున్న ఆసక్తి

- ఆరోగ్యంపై అవగాహనకు హాఫ్ మారథాన్‌లు దోహదం
- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ రామకృష్ణ పెరుమాండ్ల




**కాకతీయ, హనుమకొండ :** హాఫ్ మారథాన్‌లు ప్రజల్లో ఆరోగ్యం, శారీరక దృఢత్వం, క్రమశిక్షణపై అవగాహన పెంచడంతోపాటు యువతను క్రీడలు, ఫిట్‌నెస్ వైపు ప్రోత్సహిస్తాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రామకృష్ణ పెరుమాండ్ల అన్నారు. హనుమకొండలో శనివారం నాయిని విశాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రై సిటీస్ హాఫ్ మారథాన్‌లో ప్రజలు, యువత, అథ్లెట్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నీలిమా రాజేందర్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రోత్సహించారు. ప్రస్తుత జీవనశైలిలో శారీరక వ్యాయామానికి ప్రాధాన్యం పెంచుకోవాలని, ప్రతిరోజూ నడక, పరుగు అలవాటు చేసుకోవాలని డాక్టర్ రామకృష్ణ సూచించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ వోడితల రామ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జనగామలో బతుకమ్మ వేడుకల్లో ఎర్రబెల్లి, పల్లా



**కాకతీయ, జనగామ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆకాంక్షించారు. జనగామ పట్టణంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. మహిళలు, స్థానికులతో కలిసి సంబరాల్లో భాగస్వాములయ్యారు. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగ ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో మాజీ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, వివిధ వార్డులకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సద్దుల బతుకమ్మకు ఘనంగా ఏర్పాట్లు

- ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ బానోత్ సునీత వెంకన్న



**కాకతీయ, కేసముద్రం:** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు, పాలకమండలి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా పెద్దాయ చెరువు వద్ద చేపడుతున్న ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్మన్ అల్లం రమ నాగేశ్వరరావు, వార్డు కౌన్సిలర్లు పరిశీలించారు. వేడుకలకు హాజరయ్యే మహిళలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. సద్దుల బతుకమ్మ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు కరువు

- ఎమ్మెల్యే చెప్పినా అరకొర వసతులే
- మూడేండ్లుగా సొంత ఖర్చులతో వసతులు కల్పిస్తున్న యువత
- 14వ డివిజన్ సుందరయ్య నగర్‌లో వేడుకలపై చిన్నచూపు



**కాకతీయ, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ సుందరయ్య నగర్ లో బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు కరువయ్యాయి. కొన్నేండ్లుగా సుందరయ్య నగర్ నుంచి కాశిబుగ్గ లో జరిగే బతుకమ్మ వేడుకలకు వెళ్లేందుకు మహిళలు, యువతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని గత రెండు సంవత్సరాలుగా స్థానిక యువత సొంత ఖర్చులతో సుందరయ్య నగర్ ఎన్టీఆర్ నగర్ మధ్య గల ఖాళీ స్థలంలో వేడుకలను నిర్వహిస్తోంది. ఈ వేడుకల్లో 500 మందికి పైగా మహిళలు పాల్గొంటున్నారు. ఈ ఏడాది ఉత్సవాల కోసం ఏర్పాట్లు చేయాలని స్థానిక యువత వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దృష్టికి తీసుకెళ్లింది. ఆయన స్పందించి వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు చెప్పారు. అయినప్పటికీ గతంలో అక్కడ జిడబ్లూఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయలేదు అనే సాకుతో వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎమ్మెల్యే చెప్పినా కేవలం జేసీబీ ని పంపించి, డస్ట్ మాత్రమే పోశారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో స్థానిక యువతే సొంత ఖర్చులతో ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. స్థానికులు సొంత ఖర్చులతో ఏర్పాటు చేసుకుంటే జిడబ్ల్యుఎంసీ ఉన్నది ఎందుకని స్థానికులు విమర్శిస్తున్నారు. కాశిబుగ్గలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నాం కదా అంటూ అధికారులు ఉచిత సలహాలు ఇస్తున్నారని, స్థానికులు, యువత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీడబ్ల్యూ ఎం సీ అధికారులు ఇప్పటికైనా స్పందించి అవసరమైన లైటింగ్, సౌండ్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సౌకర్యాలు కూడా కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు

## ఐలమ్మ పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం

- ప్రజల కోసం పోరాడినవారు గుండెల్లో నిలిచిపోతారు
- హైకోర్టు న్యాయవాది, విగ్రహదాత డాక్టర్ నలమాస కృష్ణ గౌడ్
- శ్రీరామగిరిలో వీరనారి విగ్రహావిష్కరణ



**కాకతీయ, నెల్లికుదురు:** వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి యువతరానికి ఆదర్శంగా నిలవాలని హైకోర్టు న్యాయవాది, విగ్రహదాత డాక్టర్ నలమాస కృష్ణ గౌడ్ అన్నారు. శనివారం శ్రీరామగిరి గ్రామంలో చాకలి ఐలమ్మ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐలమ్మ విగ్రహాన్ని నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ, మానుకోట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడాల సత్యనారాయణతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మది కీలక పాత్ర అని పేర్కొన్నారు. ప్రజల హక్కులు, న్యాయం కోసం పోరాడినవారు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. సబ్బండ వర్గాల కోసం త్యాగం చేసిన ఐలమ్మను వీరనారిగా స్మరించుకోవడం గర్వకారణమని తెలిపారు. హైదరాబాద్‌లోని మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టడం ఆమె పోరాట వారసత్వానికి గుర్తింపు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాదారి ప్రశాంత్, సంఘం అధ్యక్షుడు సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి మడిపెద్ది ముఖేష్, పలువురు వైద్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ములుగు మత్తులో.. సిండికేట్ సత్తా!

- జిల్లాలో 2,700లకు పైగా బెల్ట్ షాపులు
- ప్రతీ గ్రామంలో అనధికారికంగా వైన్‌షాపులు
- 29 వైన్ షాపుల నుంచి బెల్ట్ షాపులకు సరఫరా
- సిండికేట్ గుప్పిట్లో మద్యం వ్యాపారం
- బెల్ట్ షాపుల్లో రూ.20 నుంచి రూ.30ల అదనం
- ఫుట్ బాటిళ్లంపై రూ.50 నుంచి రూ.100 వరకు పెట్టాల్సిందే
- కొరవడిన ఎక్సైజ్ శాఖ అధికారుల నిఘా
- మామూళ్ల మత్తే కారణమంటున్న జిల్లా వాసులు






**కాకతీయ, ఏటూరునాగారం :** ములుగు జిల్లాలో మద్యం వ్యాపారం మూడు బాటిళ్లు.. ఆరు బెల్ట్ షాపులన్న చందంగా సాగుతోంది. ప్రభుత్వ అనుమతితో నడిచే వైన్స్‌ల నుంచి గ్రామాల్లోని బెల్ట్ షాపులకు మద్యం యథేచ్ఛగా చేరుతోంది. ఈ వ్యవహారంలో సిండికేట్ నిర్వాహకులదే పైచేయిగా మారింది. జిల్లాలో 29 వైన్స్ షాపులుండగా.. 2,700కు పైగా బెల్ట్ షాపులు ఉన్నాయి. పది మండలాలు.. 335 గ్రామాల పరిధిలో అనధికారిక మద్యం విక్రయాలు సాగుతున్నాయి. అక్రమ విక్రయాలను అడ్డుకోవాల్సిన యంత్రాంగం ఏం చేస్తోంది? బెల్ట్ దందా ఇంతగా విస్తరించడానికి కారణాలేంటి? అన్న ప్రశ్నలు జిల్లా వ్యాప్తంగా వినిపిస్తున్నాయి. మద్యం కొనాలంటే నిర్ణీత ధరకు మించి చెల్లించాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. బెల్ట్ షాపుల్లో క్వార్టర్ బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30, ఆఫ్ బాటిల్‌పై రూ.40 నుంచి రూ.50, ఫుల్ బాటిల్‌పై రూ.50 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. గ్రామాల్లో అధికారిక వైన్స్ అందుబాటులో లేకపోవడం, రాత్రి వేళల్లో మద్యం అవసరమయ్యే పరిస్థితులను కొందరు నిర్వాహకులు అవకాశంగా మలుచుకుంటున్నారు. ఒకవైపు నిర్ణీత ధరలకు మద్యం విక్రయించాల్సిన నిబంధనలు.. మరోవైపు అదనపు వసూళ్ల దందా.. వెరసి వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రత్యేక స్టిక్కర్లు.. ఎవరి పరిధి వారిదేనా?**

బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేసేందుకు కొందరు నిర్వాహకులు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో వైన్స్ నిర్వాహకులే వాహనాల ద్వారా మద్యం తరలిస్తున్నారు. బాటిళ్లపై ప్రత్యేక స్టిక్కర్లు వేసి, ఏ ప్రాంతానికి చెందిన సరుకో గుర్తించేలా వ్యవహరిస్తున్నారు. సిండికేట్ నిర్వాహకులు తమ పరిధులను పంచుకుని వ్యాపారం సాగిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి మద్యం తీసుకువచ్చే వారిపై చర్యలు తీసుకుంటున్న అధికారులు.. స్థానిక వైన్స్‌ల నుంచే బెల్ట్ షాపులకు సరఫరా జరుగుతోంది. కొన్ని వైన్స్‌లు మధ్యాహ్నం 12 గంటలకే తెరిచి, సాయంత్రం 4.30 గంటలకే మూసివేస్తుండటం గమనార్హం. ఈ సమయంలో మద్యం ఎక్కడికి తరలుతోంది? విక్రయాల లెక్కలు, నిల్వలు సరిపోతున్నాయా? అన్న అంశాలపై తనిఖీలు జరగాల్సి ఉంది. బెల్ట్ షాపుల వ్యవహారంపై నెలవారీ మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలున్నాయి.

**దందాకు అడ్డుకట్ట ఎప్పుడు?**

జిల్లాలో బెల్ట్ షాపుల సంఖ్య, మద్యం సరఫరా మార్గాలు, వైన్స్‌ల విక్రయాల లెక్కలపై సమగ్ర పరిశీలన జరపాల్సిన అవసరం ఉంది. 29 వైన్స్‌ల నుంచి ఇంత విస్తృతంగా మద్యం సరఫరా జరుగుతోందనే ఆరోపణలపై ఎక్సైజ్ శాఖ వాస్తవాలను వెల్లడించాలి. బెల్ట్ షాపులపై తనిఖీలు నిర్వహించి, అదనపు ధరల వసూళ్లు, అక్రమ రవాణా, నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. మద్యం వ్యాపారంలో అక్రమాలకు తావులేకుండా పారదర్శక పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. బెల్ట్ దందా ఆరోపణలపై అధికారులు ఎప్పుడు స్పందిస్తారు? సిండికేట్ వ్యవహారంపై తనిఖీలు ఎప్పుడు మొదలవుతాయి? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్న.

## వరంగల్ అభివృద్ధికి ఐటీ టవర్ల ఏర్పాటుకు కృషి

- ప్రతిపాదనలను పరిశీలించి ముందుకు తీసుకెళ్తాం
- చారిత్రక ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- భద్రకాళి అమ్మవారి రథాన్ని ప్రారంభించిన మంత్రి, ఎమ్మెల్యే నాయిని



**కాకతీయ, హనుమకొండ :** వరంగల్, హనుమకొండ నగరాల్లో ఐటీ టవర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి, వాటిని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన వరంగల్ నగరంలో పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హనుమకొండలో నిర్వహించిన ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ రెండో ఎడిషన్‌ను ప్రారంభించిన అనంతరం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి నగరంలోని ప్రముఖ ఆలయాలను సందర్శించారు. తొలుత శ్రీ పద్మాక్షి అమ్మవారిని దర్శించుకుని హోమపూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. అమ్మవారి రథ నిర్మాణ పనులు పూర్తికావడంతో ఆలయ అధికారులు, అర్చకుల ఆధ్వర్యంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి రథాన్ని ప్రారంభించారు. అమ్మవారి రథం మాడవీధుల్లో ఊరేగింపునకు సిద్ధం కావడం సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు.

**వారసత్వ సంపద పరిరక్షణకు ప్రాధాన్యం**

అనంతరం వేయిస్తంభాల దేవాలయంలో శ్రీ రుద్రేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి వద్ద కూడా పూజల్లో పాల్గొన్నారు. వరంగల్ నగరం చారిత్రక కట్టడాలు, ప్రాచీన ఆలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలకు నిలయమని మంత్రి తెలిపారు. ఈ వారసత్వ సంపదను కాపాడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు వరంగల్, హనుమకొండ నగరాల్లో ఐటీ టవర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి ముందుకు తీసుకెళ్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నాయిని నీలిమా రాజేందర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆయా ఆలయాల అధికారులు, ప్రధాన అర్చకులు, పురోహితులు మంత్రికి, ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలు అందించారు.

## రూ.5లక్షల విలువైన ఎండు గంజాయి పట్టివేత

- కేసముద్రం పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు



**కాకతీయ, కేసముద్రం:** ఒడిశా నుంచి గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించేందుకు తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను కేసముద్రం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 10.165 కిలోల ఎండు గంజాయి, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. అక్టోబర్ 17న ఉదయం 10.50 గంటలకు కేసముద్రం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జ్యోతిరావు పూలే సెంటర్ వద్ద పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. వారి వద్ద ఉన్న రెండు బ్యాగులు, ఒక చేతి సంచిలో బ్రౌన్ రంగు టేపుతో ప్యాక్ చేసిన గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో ఒడిశాకు వెళ్లి గంజాయి కొనుగోలు చేసి, చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి హైదరాబాద్‌లో విక్రయించడం ద్వారా లాభాలు పొందాలని నిందితులు ప్రణాళిక వేసుకున్నట్లు వెల్లడైంది. అరెస్టయిన వారిలో హైదరాబాద్ ఓల్డ్ అల్వాల్ హరిజనవాడకు చెందిన కుమ్మరి నితిన్ (23), మేడ్చల్ జిల్లా షామీర్‌పేట మండలం ఉప్పరపల్లికి చెందిన తాండ్ర బాలకృష్ణ (21), జేజల అభినాష్ (21) ఉన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు చట్టరీత్యా నేరమని పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి కార్యకలాపాల సమాచారం అందించిన వారికి రూ.5,000 నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు.

## మార్కెట్‌కు వరుసగా 5 రోజుల సెలవు

**కాకతీయ, కేసముద్రం:** కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు అక్టోబర్ 17 నుంచి 21వ తేదీ వరకు వరుసగా 5 రోజుల పాటు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తెలిపారు. తిరిగి అక్టోబర్ 22న గురువారం మార్కెట్ పునఃప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు, వ్యాపారులు, గుమస్తాలు, కూలీలు గమనించాలని సూచించారు.

## పోడు భూముల్లో కందకాల తవ్వకం ఆపాలి!

- ఆదివాసీల సాగు భూముల్లో అటవీ శాఖ చర్యలు నిలిపివేయాలి
- అర్హులైన గిరిజన రైతులకు హక్కు పత్రాలు అందించాలి
- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి




**కాకతీయ, ఏటూరునాగారం:** గత 25 ఏళ్లుగా ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో అటవీ శాఖ అధికారులు లోతైన కందకాలు తవ్వడాన్ని తక్షణమే నిలిపివేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఏటూరునాగారంలో ఎండీ దావూద్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు భూముల్లో కందకాలు తవ్వడం వల్ల ఆదివాసీల జీవనోపాధికి విఘాతం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని గిరిజనులు కోరుతుంటే, మరోవైపు అదే భూముల్లో కందకాలు తవ్వడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో పోడు భూములకు పట్టాలిచ్చేందుకు సర్వేలు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన ఆదివాసీ రైతులకు హక్కు పత్రాలు అందించాలని, అటవీ శాఖ చర్యలను నిలిపివేయాలని కోరారు. కందకాల తవ్వకాలు ఆపకపోతే మరో పోడు భూముల పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణకు సీపీఎం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బి. రెడ్డి సాంబశివ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి. వెంకటరెడ్డి, రాజేందర్, తోలం కృష్ణయ్య, ప్రభాకర్, నగేష్, చిరంజీవి, లాజర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## భూ పరిహారం ముందే చెల్లించాలి

- పంటలు ధ్వంసం చేయడాన్ని ఆపాలి
- ఖరీఫ్ కోతలు పూర్తయ్యే వరకు భూములు తీసుకోవద్దు
- రైతుల వాస్తవ నష్టాలను పరిగణనలోకి తీసుకోవాలి
- ఏఐకేఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు



**కాకతీయ, గీసుగొండ :** నాగ్‌పూర్ నుంచి విజయవాడ వరకు నిర్మించతలపెట్టిన 4 వరుసల గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి కోసం రైతుల పంట పొలాలను ధ్వంసం చేయడాన్ని వెంటనే నిలిపివేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ముందుగా నష్టపరిహారం చెల్లించిన తర్వాతే భూములను స్వాధీనం చేసుకోవాలని స్పష్టం చేశారు. శుక్రవారం గీసుగొండ మండలం గంగాదేవిపల్లి శివారులో పంట నష్టపోతున్న రైతుల భూములను రైతు సంఘాల నాయకులు సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న గంగాదేవిపల్లి శివారు ప్రాంతంలో రైతులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా పంటలను ధ్వంసం చేసేందుకు జాతీయ రహదారుల శాఖ, రెవెన్యూ అధికారులు ప్రయత్నించడం సరికాదని నాయకులు పేర్కొన్నారు. భూసేకరణ చట్టం-2013 ప్రకారం రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని కోరారు. ఒకే ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు వేర్వేరు గ్రామాల్లో వేర్వేరు విధాలుగా పరిహారం నిర్ణయించడం అన్యాయమని అన్నారు.

**ఎకరాకు రూ.1.30 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం**

ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో ఖరీఫ్ పంటల దిగుబడులు ఆశించిన స్థాయిలో లేవని, రైతులు పత్తి, మొక్కజొన్నతో పాటు కూరగాయలు సాగు చేశారని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో పంటలకు డిమాండ్ ఉండటంతో కొంతైనా ఆదాయం వస్తుందని ఆశిస్తున్న రైతుల పంటలను ధ్వంసం చేయడం తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరా పంట నష్టానికి రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు పరిహారం ఇస్తామని అధికారులు ప్రకటిస్తున్నప్పటికీ, పంట దిగుబడి ద్వారా ఎకరాకు సుమారు రూ.1.30 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని వివరించారు. రైతుల వాస్తవ నష్టాలను పరిగణనలోకి తీసుకొని తగిన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ఖరీఫ్ పంటల కోత పూర్తయ్యే వరకు రైతుల భూములను స్వాధీనం చేసుకోవద్దని, ముందుగా నష్టపరిహారం చెల్లించిన తర్వాతే భూములు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు సోమిడి సాంబయ్య, సిర్ల రవీందర్‌తో పాటు బాధిత రైతులు పెండ్లి చిన్న మల్లారెడ్డి, పెండ్లి సరోజన, రమేష్, ఎరుకల రమేష్, ప్రవీణ్, విమల తదితరులు పాల్గొన్నారు.

## నంబర్ ప్లేట్ లేదు.. దర్పం మాత్రం ఫుల్!

- జిల్లా యూత్ ప్రెసిడెంట్ బోర్డుతో ఇన్నోవా క్రిస్టా హల్‌చల్
- నేతల వాహనాలకు నిబంధనలు వర్తించవా?
- ట్రాఫిక్ పోలీసుల తీరుపై ప్రజల ప్రశ్నలు




**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** వరంగల్ నగర రోడ్లపై నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న ఓ ఇన్నోవా క్రిస్టా వాహనం చర్చనీయాంశంగా మారింది. వెనుక నంబర్ ప్లేట్ ఉండాల్సిన చోట 'యూత్ కాంగ్రెస్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ వరంగల్' అనే బోర్డు ఏర్పాటు చేసి వాహనం తిరుగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. సామాన్య వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు నిబంధనల ఉల్లంఘనకు జరిమానాలు విధిస్తుండగా, ఈ వాహనంపై చర్యలు తీసుకుంటారా? అని ప్రశ్నిస్తున్నారు. హోదా బోర్డు ఉన్నంత మాత్రాన వాహన నిబంధనల నుంచి మినహాయింపు ఉంటుందా? అని నిలదీస్తున్నారు. వాహనం ఎవరిది, దానికి సరైన రిజిస్ట్రేషన్ ఉందా, వెనుక నంబర్ ప్లేట్ ఎందుకు కనిపించడం లేదనే అంశాలపై పోలీసులు విచారణ జరపాలని కోరుతున్నారు. నంబర్ ప్లేట్ నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సాధారణ వాహనదారులకు ఒక రకంగా, రాజకీయ హోదా బోర్డులు ఉన్న వాహనాలకు మరో రకంగా నిబంధనలు అమలు చేస్తున్నారా? అన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ వాహనంపై ట్రాఫిక్ పోలీసులు స్పందించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారా లేదా అన్నది వేచి చూడాలి.

## అష్టలక్ష్మి అవతారంలో దుర్గామాత

**కాకతీయ, దుగ్గొండి:** మండల కేంద్రంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు దుర్గామాతను అష్టలక్ష్మి అవతారంలో రూ.2,01,000 విలువైన ఆభరణాలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కూస సుమన్, సాంబరాజు బిక్షపతి, అలవాలా పవన్, సందీప్, పుత్తిన్, పునీత బాలు, పురోహితుడు శివయ్య తదితరులు పాల్గొన్నారు.



Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at
H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266